సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం। 28। జనవరి। 2025



విజ్ఞానం పెంచేలా..
ప్రధానమంత్రి స్కూల్స్ రైసింగ్ ఇండియా(పీఎం శ్రీ) విద్యార్థులను విజ్ఞాన యాత్రలకు పంపేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. 8లో



ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి
విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలని ఉమ్మడి రాష్ట్ర మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విద్యాసాగర్ అన్నారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
33° / 19°
జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగానే నమోదవుతాయి. తెల్లవారు జామున, రాత్రి పూట చలి ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి స్వామి మూలమూర్తులు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతీ సోమవారం స్వామివారిని ఈ రూపంలో అలంకరించటం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నేడు పెద్దమ్మతల్లి ఆలయంలో రుద్రహోమం

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కేశవాపురం – జగన్నాధపురం మధ్య కొలువైన శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో మంగళవారం రుద్రహోమం నిర్వహిస్తున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు యాగశాలలో రుద్రహోమం జరుగుతుందని పేర్కొన్నారు. హోమంలో పాల్గొనే భక్తులు రూ.1,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని, వివరాలకు 63034 08458 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కేసుల విచారణలో జాప్యం చేయొద్దు



ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంటౌన్: కేసుల విచారణలో జాప్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ రోహిత్‌రాజ్ పోలీస్ సిబ్బందిని హెచ్చరించారు. జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో సోమవారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నేరస్తులకు శిక్ష పడేలా, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని, గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలని అన్నారు. మట్కా, జూదం వంటి అసాంఘిక చర్యలపై నిఘా పెట్టాలన్నారు. ప్రతీ పోలీసు స్టేషన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆధునిక సాంకేతికను వినియోగించి చోరీ కేసులను ఛేదించాలని, సొమ్ము రికవరీ చేసి బాధితులకు అందజేయాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలు గుర్తించి, సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ సింగ్, కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు డీఎస్పీలు రెహమాన్, సతీష్‌కుమార్, చంద్రభాను, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఎల్‌ఎన్ కిట్లను సమర్థంగా వినియోగించాలి

కొత్తగూడెంఅర్బన్: సమగ్ర శిక్ష, ఐఐటీ గాంధీనగర్ సంయుక్త ఆధ్వర్యంలో తయారుచేసిన ఎఫ్‌ఎల్‌ఎన్ వండర్ బాక్స్‌లోని బోధనా సామగ్రిని సమర్థంగా వినియోగించి పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలని విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్ అన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 144 పీఎస్‌లకు ఈ కిట్లు సరఫరా చేయగా, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు సోమవారం శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణ తర్వాత కూడా సందేహాలుంటే ఐఐటీ గాంధీనగర్ యూట్యూబ్ చానల్ ద్వారా నివృత్తి చేసుకోవాలని సూచించారు. రిసోర్స్ పర్సన్లు బి.శంకర్, ఎ.రమేష్, ఎల్.భీముడు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

గేరు మార్చిన సింగరేణి ?



సింగరేణి గనిలో కార్మికులు (ఫైల్)

కొన్నేళ్లుగా బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని వ్యతిరేకిస్తున్న సంస్థ

- ఎన్నో ఏళ్లుగా టెండర్లకు దూరం..
- ఫలితంగా తెలంగాణ బయట విస్తరణకు బ్రేక్‌లు
- ఎట్టకేలకు ఒడిశాలో కోల్ బ్లాక్ కోసం బిడ్ వేయాలని నిర్ణయం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: బొగ్గు బ్లాక్‌ల వేలం ప్రక్రియపై 11 ఏళ్లుగా బిగుసుకున్న పీటముడిని విప్పేందుకు సింగరేణి సిద్ధమవుతోందా అన్న ప్రశ్నకు అవుననే సమాధానమే వస్తోంది. మారుతున్న పరిస్థితులకు తగ్గట్టుగా సంస్థ అడుగులు వేయనున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే రాష్ట్రం బయట కూడా సంస్థ విస్తరించనుంది.

బొగ్గు బ్లాక్‌ల వేలం

బొగ్గు ఉత్పత్తి రంగంలో సరైన పోటీ లేకపోవడంతో కోల్ ధరలు ఎక్కువగా ఉన్నాయని, తద్వారా థర్మల్ విద్యుత్ ఉత్పత్తి వ్యయం పెరుగుతోందని 2014 తర్వాత కేంద్రం సరికొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. దీంతో దేశంలో గుర్తించిన బొగ్గు బ్లాక్‌లపై ప్రభుత్వ రంగ సంస్థల గుత్తాధిపత్యానికి చెక్ పెట్టినట్లయింది. ఈ క్రమాన బొగ్గు బ్లాక్‌ల వేలంలో ప్రైవేట్, ప్రభుత్వ రంగ సంస్థలు పాల్గొంటేనే దక్కించుకునే విధానం మొదలైంది.

విస్తరణకు బ్రేక్

బొగ్గు ఉత్పత్తికి సంబంధించి తెలంగాణ బ్లాక్‌ల్లో ఒక టన్నుకు సగటున ఆరు టన్నుల వరకు ఓవర్ బర్డెన్ (మట్టి) తొలగించాల్సి వస్తుండగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాల్లోని బ్లాక్‌ల్లో ఒక టన్నుకు సగటున రెండు టన్నుల లోపే ఓబీ తొలగిస్తే సరిపోతోంది. దీంతో ఉత్పత్తి వ్యయం అక్కడ తగ్గుతోంది. అయితే, దేశ వ్యాప్తంగా కమర్షియల్ బొగ్గు బ్లాక్‌లను వేలం ద్వారానే కేటాయిస్తుండడం, ఆ ప్రక్రియకు సింగరేణి దూరంగా ఉండడంతో ఇతర రాష్ట్రాల్లో కోల్ బ్లాక్‌లు దక్కించుకోవడం సాధ్యం కావడం లేదు. కేవలం పిట్ హెడ్ ప్లాంట్ మోడ్‌లో తెలంగాణ వెలుపల నైనీ బ్లాక్‌ను దక్కించుకుంది. ఈ మోడ్(విధానం)లో నైనీ బ్లాక్ నుంచి వచ్చే బొగ్గును వాణిజ్య అవసరాలకు అమ్మకుండా కచ్చితంగా సొంత థర్మల్ పవర్ ప్లాంట్‌కే వినియోగించుకోవాల్సి ఉంటుంది.

ఆచితూచి అడుగులు..

కేంద్రంలో మూడోసారి ఎన్డీఏ సర్కారు కొలువుదీరాక బొగ్గు బ్లాక్‌ల వేలం విషయంలో ఆచితూచి వ్యవహరించాలని నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగానే తెలంగాణలో బొగ్గు బ్లాక్‌లను వేలం వేయొద్దని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం గత జూన్‌లో విజ్ఞప్తి చేసింది. మరోవైపు సింగరేణి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వేలం పాటకు వెళ్తే ఎలా ఉంటుందనే అంశంపై అదే ఏడాది ఆగస్టులో ఐదు కార్మిక సంఘాలతోనూ యాజమాన్యం చర్చలు జరిపింది. ఈ నేపథ్యాన బొగ్గు బ్లాక్‌ల వేలం అంశంపై పునరాలోచన చేయాలని నిర్ణయించింది.

శారదాపూర్ బ్లాక్..

ఒడిశాలోని శారదాపూర్ ఈస్ట్, వెస్ట్ బ్లాక్‌ల్లో జీ 13 గ్రేడ్‌కు చెందిన బొగ్గు నిక్షేపాలు వెయ్యి మిలియన్ టన్నులకు పైగా ఉన్నాయి. ఈ బ్లాక్‌ల వేలం ప్రక్రియలో పాల్గొనేలా బిడ్ దాఖలకు ఈనెల 31వ తేదీ వరకు సమయం ఉంది. దీంతో బిడ్ దాఖలు చేసేందుకు వీలుగా అవసరమైన ప్రతులను సింగరేణి సిద్ధం చేసినట్టు సమాచారం. అంతేకాక వేలంలో పాల్గొనేందుకు అనుమతించాలని ప్రభుత్వాన్ని సైతం కోరింది. కాగా, బొగ్గు బ్లాక్‌ల వేలం అంశం సున్నితమైనది కావడంతో ఈ అంశంపై సింగరేణి నుంచి అధికారికంగా స్పందించేందుకు ఎవరూ సుముఖంగా లేరు.

ప్రైవేట్ పరం చేయొద్దంటూ..

తొలి నుంచి వాణిజ్య పరమైన బొగ్గు బ్లాక్‌ల వేలం ప్రక్రియకు సింగరేణి దూరంగా ఉంటోంది. ఇదే సమయాన తెలంగాణలో తాడిచర్ల, కోయగూడెం–3, శ్రావణపల్లి, సత్తుపల్లి–3, కల్యాణిఖని–6 బ్లాక్‌లను వేలం వేయగా కొన్నింటిని ప్రైవేట్ కంపెనీలు దక్కించుకున్నాయి. ఇప్పటికే తాడిచర్లలో బొగ్గు ఉత్పత్తి కూడా ప్రారంభమైంది. దీంతో ఈ విధానాన్ని అప్పటి తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. ఫలితంగా ఈ అంశం రాజకీయ కోణంలో జఠిలంగా మారింది. ఆపై తెలంగాణలో బ్లాక్‌లను ప్రైవేట్‌కు ఇవ్వొద్దని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తూ వస్తోంది.

రైతు భరోసా షురూ..



రైతుల ఖాతాల్లో నగదు జమ అయినట్లు వచ్చిన మెసేజ్‌లు

- బ్యాంకు ఖాతాల్లో నగదు జమ
- తొలిరోజు రూ. 39.06 కోట్లు మంజూరు
- 22, 242 మంది రైతులకు లబ్ధి

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతు భరోసా పథకం కింద అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ ప్రక్రియ ప్రారంభమైంది. గ్రామాల్లో చేపట్టిన భూ సర్వే ప్రకారం సాగుకు పనికి రాని భూములను గుర్తించిన అధికారులు వివరాలు అప్‌డేట్ చేయగా.. సాగు యోగ్యమైన భూములున్న రైతుల ఖాతాల్లో సోమవారం నుంచి నిధులు జమవుతున్నాయి. ఈ సీజన్‌లో ఎకరానికి రూ.6 వేల చొప్పున సంవత్సరానికి రెండు సీజన్లలో కలిపి రూ.12 వేల పెట్టుబడి సాయం అందుతుంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎకరానికి రెండు విడతల్లో కలిపి రూ.10 వేలు ఇవ్వగా, ప్రస్తుత ప్రభుత్వం రూ.2 వేలు పెంచి మొత్తంగా రూ.12 వేల చొప్పున అందిస్తోంది. వ్యవసాయశాఖ అధికారుల గణాంకాల ప్రకారం జిల్లాలో 1.87 లక్షల ఎకరాల భూములు రైతు భరోసాకు అర్హత సాధించాయి. 2,800 ఎకరాల భూములు సాగులో లేనట్టుగా గుర్తించగా, ఇందులో 750 ఎకరాలు సీతారామ ప్రాజెక్టు కింద ఉంది. కాగా, తొలిరోజు ఎంపిక చేసిన గ్రామాల్లోని 22,242 మంది రైతులకు సంబంధించిన 65,112.58 ఎకరాలకు రూ. 39,06,75,458 జమయ్యాయి.

ఖాతాల్లో జమవుతున్నాయి



రైతు భరోసా డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమవుతున్నాయి. రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా లాంఛనంగా ప్రారంభించినా ఆ రోజు సెలవు కాబట్టి సోమవారం నుంచి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయి. సాగులో ఉన్న భూమికి రైతు భరోసా అందుతుంది.

– వి. బాబూరావు, జిల్లా వ్యవసాయాధికారి

జిల్లాలో తొలిరోజు నగదు జమ అయిన రైతుల వివరాలిలా..

మండలం	రెవెన్యూ గ్రామం	రైతులు	ఎకరాలు	జమ (రూ.ల్లో)
ములకలపల్లి	చాపరాలపల్లి	985	2,837.08	1,70,22,475
చండ్రుగొండ	గుర్రాయిగూడెం	672	1,567.91	94,07,437
దమ్మపేట	నాగుపల్లి	1,547	5,031.53	3,01,89,150
అశ్వారావుపేట	తుమ్మలకుంట	1,615	5,818.21	3,49,09,272
అన్నపురెడ్డిపల్లి	ఊటుపల్లి	440	1,399.68	83,98,050
భద్రాచలం	భద్రాచలం	104	393.15	23,58,885
చర్ల	సుబ్బంపేట	146	269.19	16,15,110
చర్ల	సుబ్బంపేట 2	135	175.33	10,51,978
దుమ్ముగూడెం	పెద్ద కమలాపురం	357	1,438.31	86,29,845
దుమ్ముగూడెం	ఎర్రబోరు	75	234.09	14,04,539
లక్ష్మీదేవిపల్లి	గట్టుమళ్ల	445	1,317.29	79,03,746
కొత్తగూడెం	కొత్తగూడెం	117	258.80	15,52,794
చుంచుపల్లి	పెనుబల్లి	48	71.53	4,29,150
సుజాతనగర్	సుజాతనగర్	2,089	3,877.62	2,32,65,737
పాల్వంచ	తోగ్గూడెం	210	469.95	28,19,700
ఆళ్లపల్లి	అనంతోగు	713	4,034.88	2,42,09,250
పినపాక	ఈ బయ్యారం	821	1,813.08	1,08,78,450
గుండాల	లింగగూడెం	1,191	3,942.43	2,36,54,550
మణుగూరు	మల్లారం	133	321.13	19,26,750
కరకగూడెం	రేగళ్ల	417	1,499.43	89,96,586
బూర్గంపాడు	సోంపల్లి	393	792.95	47,57,690
అశ్వాపురం	తుమ్మలచెరువు	898	2,955.55	1,77,33,300
జూలూరుపాడు	కాకర్ల	1,495	4,168.07	2,50,08,390
టేకులపల్లి	బేతంపూడి	5,637	15,755.42	9,45,32,550
ఇల్లెందు	సుదిమళ్ల	1,559	4,670.01	2,80,20,074
మొత్తం		22,242	65,112.58	39,06,75,458

'పేట'.. ఇక పట్టణం

- అశ్వారావుపేటను మున్సిపాలిటీగా మారుస్తూ ఆదేశాలు
- జారీ చేసిన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్
- కమిషనర్, ప్రత్యేకాధికారి, ఇంజనీర్, టీపీఓల నియామకం



అశ్వారావుపేటలోని రింగ్ సెంటర్

అశ్వారావుపేట: అశ్వారావుపేటను మున్సిపాలిటీగా మారుస్తూ మున్సిపల్ కమిషనర్ అండ్ డైరెక్టర్ డాక్టర్ టి.కె. శ్రీదేవి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ మున్సిపల్ చట్టం 2025 ప్రకారం, జీఓ నంబర్–14 ప్రకారం అశ్వారావుపేట, పేరాయిగూడెం, గుర్రాలచెరువు గ్రామపంచాయతీలను కలిపి అశ్వారావుపేట మున్సిపాలిటీగా ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. మున్సిపాలిటీని 22 వార్డులుగా విభజిస్తూ మున్సిపల్ కమిషనర్‌తో పాటు చైర్మన్/చైర్ పర్సన్ స్థానంలో ప్రత్యేకాధికారిని నియమించాల్సి ఉంటుంది. ఈ మేరకు అశ్వారావుపేట మున్సిపల్ కమిషనర్‌గా పాల్వంచ మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, ప్రత్యేకాధికారిగా వరంగల్ రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ షాహిద్ మసూద్, మున్సిపల్ ఇంజనీర్‌గా పాల్వంచ మున్సిపాలిటీ ఏఈఈ డి.రాము, టీపీఓగా సత్తుపల్లి టీపీఓ జి.నవీన్‌కుమార్, జూనియర్ అకౌంట్స్ అధికారిగా సత్తుపల్లి మున్సిపాలిటీ జేఏఓ కిరణ్ కుమార్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

చేపట్టాల్సిన అత్యవసర చర్యలిలా..

ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించిన కమిషనర్ తక్షణమే విధులకు హాజరు కావాలని, అశ్వారావుపేట, గుర్రాలచెరువు, పేరాయిగూడెం గ్రామపంచాయతీ ఈఓలు, కార్యదర్శుల నంచి చార్జ్ తీసుకోవాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. కింద పేర్కొన్న అంశాలను ఫిబ్రవరి 6 నాటికి పూర్తి చేసి నివేదికలు సీడీఎంఏకి సమర్పించాలని ఆదేశించారు.

- గ్రామపంచాయతీల మినిట్స్ బుక్స్‌ను సీజ్ చేయాలి
- ప్రస్తుత పంచాయతీల బ్యాంకు ఖాతాలను ముగించి, ది మున్సిపల్ కమిషనర్ ఆఫ్ అశ్వారావుపేట పేరున కొత్త ఖాతా తెరవాలి
- అశ్వారావుపేట మున్సిపాలిటీ అనే నేమ్‌బోర్డ్‌ను కార్యాలయంపై ఏర్పాటు చేయాలి
- గ్రామ పంచాయతీ స్థిర, చరాస్తుల వివరాలు సేకరించి రికార్డు చేయాలి
- గ్రామపంచాయతీ డిపాజిట్లు, పెట్టుబడులు స్టేట్‌మెంట్‌తో పాటుటాక్స్/నాన్‌టాక్స్ డీసీబీ(డిమాండ్, కలెక్షన్, బ్యాలెన్స్) రిజిస్టర్ రూపొందించాలి
- ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు, చెల్లించాల్సిన బిల్లుల బకాయిల జాబితా రూపొందించాలి
- గత మూడేళ్లుగా జారీ చేసిన భవన నిర్మాణ అనుమతుల జాబితా రూపొందించాలి.
- మూడు గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, శానిటరీ సూపర్‌వైజర్లు, బిల్ కలెక్టర్లు, ఇతర సిబ్బందిన వివరాలు నమోదు చేయాలి.

రాష్ట్ర బాలికల క్రికెట్ జట్టు కెప్టెన్‌గా వైష్ణవి



పొలెబోయిన వైష్ణవి

పినపాక: జాతీయ స్థాయి అండర్ – 17 బాలికల క్రికెట్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టుకు పినపాక మండలం గడ్డంపల్లికి చెందిన చెందిన వైష్ణవి రత్న కెప్టెన్‌గా ఎంపికైంది. వైష్ణవి పినపాక జూనియర్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతూ హైదరాబాద్‌లోని నెక్స్ట్ జెన్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతోంది. ఉమ్మడి జిల్లా కెప్టెన్‌గా వ్యవహరించిన వైష్ణవి.. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఖమ్మం జట్టును ప్రథమ స్థానంలో నిలిపింది. దీంతో ఆమెను రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా ఎంపిక చేశారని ఖమ్మం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ నరసింహమూర్తి తెలిపారు. వైష్ణవి రత్న తండ్రి పోలెబోయిన అనిల్‌కుమార్ పీడీగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు

ఆట పాటలతో సందడి చేసిన సింగరేణి మహిళలు



ఆట పాటలతో సందడి చేస్తున్న సేవా సభ్యులు



బొమ్మల కొలువును ప్రారంభిస్తున్న అతిథులు

ఇల్లెందు : సింగరేణి ఆఫీసర్స్ క్లబ్‌లో మహిళా క్లబ్, సేవా అధ్యక్షురాలు వి.రమ ఆధ్వర్యంలో సోమవారం బొమ్మల కొలువు కార్యక్రమం ఏర్పాటు చేశారు. సింగరేణి సీఎండీ బలరామ్ సతీమణి శారద ముఖ్య అతిథిగా హాజరు కాగా, డైరెక్టర్(పా) సతీమణి సునీత వెంకటేశ్వరరావు, ఈఅండ్‌ఎం డైరెక్టర్ సతీమణి హరిణీ సత్యనారాయణ, కొత్తగూడెం, మణుగూరు సేవా అధ్యక్షురాళ్లు మధుర వాణి, సుమ రాంచందర్, సెక్యూరిటీ జీఎం సతీమణి రోజా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా శారద బలరామ్ మాట్లాడుతూ.. సందేశాత్మకంగా బొమ్మల కొలువు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం మహిళలు వేసిన రంగవల్లులు, భద్రాచలం తెప్పోత్సవం వంటి సెట్టింగ్‌లు ఆకట్టుకున్నాయి. మహిళలు ఆట పాటలతో సందడి చేయగా.. విజేతలకు బహుమతులు అందజేశారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్



సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన దరఖాస్తులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరిష్కారానికి అర్హత లేకుంటే కారణాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

దరఖాస్తుల్లో కొన్ని..

- కొత్తగూడెం మున్సిపాలిటీ రామవరం ఏడో వార్డులో మున్సిపల్ రోడ్డును నాలుగడుగులు ఆక్రమించారని, 50 ఫీట్ల స్థలం ఆక్రమణకు గురైందని, మున్సిపల్ అధికారులు కూడా వారికి సహకరిస్తున్నారని బస్తీవాసులు చేసిన ఫిర్యాదును మున్సిపల్ కమిషనర్‌కు ఎండార్స్ చేశారు.
- ముర్రేడువాగులో 20 మోటార్లు ఏర్పాటుచేసి వ్యవసాయం చేసుకుంటున్నామని, కొందరు అక్రమంగా రాత్రి వేళ ఇసుక తరలిస్తుండడంతో నీరు అడుగంటుతోందని, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ములకలపల్లి మండలం సీతారాంపురం పంచాయితీ అన్నారం రైతులు ఫిర్యాదు చేశారు. దీన్ని తగు చర్యల నిమిత్తం మైన్స్ ఏడీకి ఎండార్స్ చేశారు.
- టేకులపల్లి మండలం పగళ్లపాడుకు చెందిన భూక్య సుకన్య సర్వే నంబర్ 133/146లో ఉన్న 1.24 ఎకరాల భూమికి తన తండ్రి హీరామల్ (లేటు)పేరున పాస్ పుస్తకం ఉందని, వారసురాలిగా తన పేరున మార్చాలని తహసీల్దార్ కార్యాలయంలో పలుమార్లు దరఖాస్తు చేసినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేయగా ఈ సెక్షన్‌కు ఎండార్స్ చేశారు.

పర్యాటక అభివృద్ధి పనుల్లో వేగం

- మ్యూజియం ఆవరణలో పరిశీలించిన పీఓ
- గిరిజన దర్బార్‌లో వినతుల స్వీకరణ



దర్బార్‌లో సమస్యలు తెలుసుకుంటున్న పీఓ రాహుల్

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ సమీపాన గిరిజన మ్యూజియంలో పర్యాటకులను ఆకట్టుకునేలా చేపడుతున్న పనుల్లో వేగం పెంచాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదేశించారు. అధికారులతో కలిసి ఆయన మ్యూజియం ఆవరణలో జరుగుతున్న పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ పిల్లల బోట్ షికారు కోసం కృత్రిమ చెరువు ఏర్పాటు, క్రీడా స్థలం, బాక్స్ క్రికెట్ గ్రౌండ్ పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి వచ్చేలా చూడాలని సూచించారు. అలాగే, గిరిజన సంస్కృతికి సంబంధించిన వస్తువులు, కళాఖండాలను సేకరించి మ్యూజియంకు అప్పగించేలా గిరిజన ప్రతినిధులు సహకరించాలని కోరారు. మ్యూజియంకు వచ్చిన ప్రతీఒక్కరికి గిరిజన సంస్కృతి అర్థమయ్యేలా వివరించాలన్నారు. శ్రీరామనవమి నాటికి మ్యూజియం, ఇతర పనులు పూర్తిచేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొచ్చేలా కృషి చేస్తున్నామని పీఓ తెలిపారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

ప్రతీ సోమవారం ఐటీడీఏ నిర్వహించే గిరిజన దర్బార్‌లో అందే వినతులు, ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని పీఓ రాహుల్ సూచించారు. దర్బార్‌లో గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించాక ఆయన అధికారులతో సమావేశమయ్యారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి అర్హతల ఆధారంగా సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. అలాగే, గిరిజన సంక్షేమ పాఠశాలలు, గురుకులాల్లో పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఏపీఓ(జనరల్) డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఈఈ చంద్రశేఖర్, వివిధ విభాగాల అధికారులు భాస్కర్, రమణయ్య, ఉదయ్‌కుమార్, హరీష్, హరికృష్ణ, వీరస్వామి, రవీంద్రనాథ్, వేణు, మణిధర్, ఆర్.లక్ష్మీనారాయణ, నారాయణరావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కల్లుగీత కార్మికులకు శిక్షణ



గీత కార్మికులకు కిట్లు పంపిణీ చేస్తున్న బీసీ వెల్ఫేర్ అధికారిణి విజయలక్ష్మి

అశ్వారావుపేటరూరల్: కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్ష కవచ్ పథకంలో భాగంగా బీసీ వెల్ఫేర్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం మండల పరిధిలోని అచ్యుతాపురం గ్రామంలో తాటి చెట్లు ఎక్కడం, దిగడంలో మెలకువలు, పాటించాల్సిన జాగ్రత్తలపై శిక్షకుడు అవగాహన కల్పించారు. అనంతరం బీసీ వెల్ఫేర్ శాఖ జిల్లా అధికారి విజయలక్ష్మి చేతుల మీదుగా 20 మంది గీత కార్మికులకు రూ.12 వేల విలువైన కాటమయ్య రక్ష కవచ్ కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ఉత్తర, ప్రత్యుత్తరాలన్నీ ఆన్‌లైన్‌లోనే..



సమావేశానికి హాజరైన అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా అన్ని రకాల ఉత్తర, ప్రత్యుత్తరాలు ఇక నుంచి ఆన్‌లైన్ ద్వారానే జరపాలని ఐటీ జీఎం ఆర్వీ రామ్‌కుమార్ సూచించారు. సోమవారం కొత్తగూడెం ఏరియాలోని జీఎం కార్యాలయంలో గనులు, వివిధ డిపార్ట్‌మెంట్ల హెచ్‌ఓడీలతో పేపర్ లెస్ ప్రోగ్రాంపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సర్క్యులర్లు, నోట్‌ఫైల్స్, అప్రూవల్స్ ఆన్‌లైన్ ద్వారానే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు రవీందర్, కోటిరెడ్డి, సూర్యనారాయణరాజు, సుమలత, శివకేశవరావు, యోహాన్, శ్రీరమేష్, శేషశ్రీ పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ హాల్ ప్రారంభం



టేబుల్ టెన్నిస్ హాల్‌ను ప్రారంభిస్తున్న సీఈ వెంకటేశ్వరరావు

పాల్వంచ: కేటీపీఎస్ ఐఎం కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన టేబుల్ టెన్నిస్ హాల్‌ను సోమవారం సీఈ పి.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులు మానసికోల్లాసం కోసం ఆటలు ఆడాలని సూచించారు. అధికారులు యుగపతి, శ్రీనివాస్, రాజ్‌కుమార్, కిరణ్ కుమార్, శ్రీనివాసరావు, నాగరాజు, రమణ, రాజీవ్, గిరిధర్, మహేష్, లెనిన్, శ్రీనివాస్, శామ్యూల్, కృష్ణ, విద్యాసాగర్, అఖిలేష్, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఆస్పత్రిలో విజిలెన్స్ తనిఖీలు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాసుపత్రిలో సింగరేణి విజిలెన్స్ విభాగం అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఏజీఎంఓ డాక్టర్ ఉషతో మాట్లాడి మెడికల్ బోర్డ్‌కు సంబంధించిన విషయాలపై ఆరా తీసినట్లు సమాచారం. రెండేళ్లుగా నిర్వహిస్తున్న మెడికల్ బోర్డుకు సంబంధించిన రిపోర్టులను, రికార్డులను తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ విషయమై ఆస్పత్రి ఏసీఎంఓను వివరణ కోరగా.. విజిలెన్స్ విభాగం అధికారులు సాధారణ తనిఖీల్లో భాగంగానే సోమవారం కూడా వచ్చారని తెలిపారు. కాగా గత డిసెంబర్‌లో జరిగిన మెడికల్ బోర్డులో కొందరు సిబ్బంది అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలతో, యాజమాన్యం వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేసింది. వారు బదిలీని రద్దు చేసుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు, అందుకు ఓ యూనియన్ సహకరిస్తున్నట్లు సమాచారం.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

చర్ల: మండలంలోని ఉంజుపల్లిలో సోమవారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో ఓ పూరిల్లు దగ్ధమైంది. గ్రామంలోని ఇర్పా ముత్తయ్య కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగా సోమవారం తెల్లవారుజామున ఇంట్లో మంటలు లేచి ఇల్లు మొత్తం వ్యాపించాయి. నిద్రిస్తున్న ముత్తయ్యతోపాటు కుటుంబ సభ్యులంతా మేల్కొని బయటకు పరుగులు తీశారు. ప్రమాదంలో విలువైన వస్తువులు కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.4 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చని కుటుంబీకులు భావిస్తున్నారు. రెవెన్యూ అధికారులు బాధిత కుటుంబాన్ని సందర్శించి నష్టాన్ని అంచనా వేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,506

విజ్ఞానం పెంచేలా...

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విజ్ఞాన యాత్రలు
- పీఎం శ్రీలో ఎంపికైన పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వ నిధులు
- రెండు విడతల్లో భద్రాద్రి జిల్లాకు రూ.49,38,500 మంజూరు
- ఖమ్మం జిల్లాకు రూ. 58,16,000 మంజూరు



వరంగల్‌లోని కాకతీయుల కోట వద్ద విద్యార్థులు (ఫైల్)

పాల్వంచరూరల్: ప్రభుత్వం పీఎంశ్రీ పాఠశాలల విద్యార్థులను విజ్ఞాన యాత్రలకు పంపే అవకాశం కల్పించింది. నిధులు కూడా విడుదల చేయడంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడతోపాటు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి స్కూల్స్ రైసింగ్ ఇండియా(పీఎం శ్రీ) యోజన పథకాన్ని 2022 ప్రారంభించింది. పలు పాఠశాలలను ఎంపిక చేసి తాగునీటి సౌకర్యం, డిజిటల్ గ్రంథాలయాలు, వృత్తి విద్యా కోర్సులు, ఇంటర్నెట్ కనెక్షన్లు, క్రీడాసామగ్రి, సౌర విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పిస్తోంది. తాజాగా విహార, విజ్ఞాన యాత్రలకు అవకాశం కల్పించింది.

ఉమ్మడి జిల్లాలో 56 పాఠశాలలు

ఉమ్మడి ఖమ్మంలో మొత్తం 3,374 ప్రభుత్వ విద్యాలయాలు ఉన్నాయి. ఇందులో 3,28,366 మంది విద్యార్థులు చదువుతున్నారు. కాగా 56 పాఠశాలలను పీఎం శ్రీ పథకానికి ఎంపికయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం విద్యాలయాలు 1,692 ఉండగా, 1,16,189 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీటిలో భద్రాద్రి జిల్లాలో పీఎంశ్రీ కింద మొదటి విడతలో 20 పాఠశాలలు, 7,115 మంది విద్యార్థులను, రెండో విడతలో నాలుగు పాఠశాలలు, 1,223మంది విద్యార్థులను విహారయాత్రకు ఎంపిక చేశారు. కేంద్ర ప్రభుత్వం విజ్ఞానయాత్ర కోసం మొదటి విడతగా రూ.42,22,000, రెండో విడతగా రూ.7,16,500, మొత్తం రూ.49,38,500 మంజురు చేసింది.

ఖమ్మం జిల్లాలో..

ఇక ఖమ్మం జిల్లాలో మొదటి దశలో 26 పాఠశాలల్లోని 7,689మంది విద్యార్థులు, రెండో విడతలో ఆరు పాఠశాలల్లోని 2,115 మంది విద్యార్థులు యాత్రలకు ఎంపికయ్యారు. మొదటి విడతలో రూ.45,79,500, రెండో విడతలో రూ.12,36,500, మొత్తం రూ.58,16,000మంజూరైనట్లు సంబంధిత విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ఇవి సందర్శిస్తే ఉపయోగం

విద్యార్థులు విజ్ఞానయాత్రలో భాగంగా రాష్ట్ర రాజధానిలో సైన్స్ మ్యూజియం, వ్యవసాయ యూనివర్సిటీ, అసెంబ్లీ, గోల్కొండ కోట, బిర్లా టెంపుల్, వరంగల్‌లోని కాకతీయల కాలం నాటి కోట, రామప్ప దేవాలయాలను సందర్శిస్తే విద్యార్థులకు సామాజిక, చారిత్రక విజ్ఞానం పెరుగతుందని పలువురు నిపుణులు పేర్కొంటున్నారు. జిల్లాలోని కిన్నెరసాని జలాశయం, ఖమ్మంలోని బౌద్ధస్తూపం, అశ్వారావుపేటలో వ్యవసాయ కళాశాలను కూడా సందర్శించవచ్చు.

విజ్ఞానం పెంచేలా..



విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం విజ్ఞాన యాత్రల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. జిల్లాలో మొదటి, రెండో విడతల్లో 24 పాఠశాలలు పీఎం శ్రీ పథకానికి ఎంపికయ్యారు. పాఠశాలలు మూసివేసేలోపు హెచ్ఎంలు విద్యార్థులను విజ్ఞాన యాత్రలకు తీసుకెళ్లవచ్చు. యాత్రలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయి.

–వెంకటేశ్వరాచారి, జిల్లా విద్యాశాఖాధికారి

ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

అదనపు కలెక్టర్ వేణుగోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 22 వరకు జరిగే ప్రాక్టికల్, మార్చి 5 నుంచి 25 వరకు థియరీ పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో మొదటి సంవత్సరం పరీక్షలకు 10,173 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షకు 10,062 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో నిరంతర విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించాలని, వైద్య శిబిరం, ఆర్టీసీ బస్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సీహెచ్ వెంకటేశ్వరరావు, డీఎస్పీ సత్యనారాయణ, టేకులపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సులోచనారాణి, ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్ అరవింద్‌బాబు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

ఉమ్మడి రాష్ట్ర మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విద్యాసాగర్



మాట్లాడుతున్న మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విద్యాసాగర్, పక్కన సింగరేణి సీఎండీ బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలని ఉమ్మడి రాష్ట్ర మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విద్యాసాగర్ సూచించారు. తాను పగలు పశువులు కాసి, రాత్రి సమయంలో చదువుకుని ఐఏఎస్ అధికారిగా ఎదిగానని చెప్పారు. సోమవారం కొత్తగూడెం క్లబ్‌లో 'మీ బంగారు భవిష్యత్ మీ చేతుల్లోనే'అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన సెమినార్‌లో మాట్లాడారు. ఏ విషయంలోనూ ఎవరికీ భయపడొద్దని, చేసే పని మీద ఆసక్తి పెంచుకుని ముందుకు సాగాలని ఉద్బోధించారు. ప్రభుత్వ ఉద్యోగం వస్తేనే ఉద్యోగమని, ఇతర ఉద్యోగాలు మంచివి కావని అనుకోవటం సరికాదని అన్నారు. తాను యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా చేరాక.. కలెక్టర్ అయి ఉంటే మరికొందరికి సాయం చేసేవాడివని తన తల్లి చెప్పడంతో ఉద్యోగానికి రాజీనామా చేసి సివిల్స్‌కు సాధన చేశానని తెలిపారు. తొలుత ఐపీఎస్, తర్వాత ఐఏఎస్‌కు ఎంపికయ్యానని, సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ శంకరన్‌ను ఆదర్శంగా తీసుకుని కలెక్టర్‌గా విధులు నిర్వర్తించానని వివరించారు. సింగరేణి సీఎండీ ఎస్.బలరామ్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో చదివితే తల్లిదండ్రులకు భారమవుతుందని, ఉపయోగం అంతంత మాత్రమేనని అన్నారు. నిబద్ధతతో చదివితే ఏ పాఠశాలలోనైనా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని అన్నారు. తాను ఆటో డ్రైవర్‌గా, గ్యాస్ డెలివరీ బాయ్‌గా పని చేసి చేశానని తెలిపారు. విద్యాసాగర్‌ను ఆదర్శంగా తీసుకుని సివిల్స్‌కు ప్రిపేరయ్యాయని చెప్పారు. నిత్యం విజ్ఞానం కోసం అన్వేషించాలని సూచించారు. అనంతరం యూపీఎస్సీ ప్రిపరేషన్ విధానంపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఆ తర్వాత విద్యాసాగర్, బలరామ్‌ను ఘనంగా సన్మానించారు. తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థి యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్, గువ్వల శ్రీకాంత్, పూర్ణ జీవన్, కుసుమ నవీన్‌కుమార్, అబ్దుల్ రహమాన్, దుర్గభవాని, స్వరూపారాణి, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

సోదరులకు విలేజ్ ఇన్నోవేషన్ అవార్డు



ఇన్నోవేషన్ అవార్డులను అందిస్తున్న పంచాయతీ కార్యదర్శి

చంద్రుగొండ : మండలంలోని పోకలగూడెం గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు విలేజ్ ఇన్నోవేషన్ అవార్డును దక్కించుకున్నారు. ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమంలో భాగంగా గడిచిన ఏడాది ఆగస్టు నెలలో ప్రభుత్వం ప్రాజెక్టులను ఆహ్వానించింది. దీంతో పోకలగూడెం గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి గుండా ప్రణీత్, 8వ తరగతి విద్యార్థి గుండా నిశాంత్ హౌజ్ క్లీనర్ ప్రాజెక్ట్, బట్టలు ఆరబెట్టేయంత్రంపై ఇన్నోవేషన్ చేసి పంపించారు. కాగా సోమవారం ప్రభుత్వం పంపించిన అవార్డులను పంచాయతీ సెక్రటరీ నాగేశ్వరరావు అందించారు. ఈ సందర్భంగా సోదరులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికకు పోటీలు

కొత్తగూడెంటౌన్: సీనియర్స్ విభాగంలో సాఫ్ట్‌బాల్ పురుషులు, మహిళల జట్ల ఎంపికకు ఈనెల 29, ఫిబ్రవరి 2న పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.నవీన్‌కుమార్ తెలిపారు. ఈనెల 29న పాల్వంచలోని టీజీటీడబ్ల్యూఆర్‌డీసీ గర్ల్స్(పాత కేఎల్‌ఆర్ కాలేజీ)లో ఉదయం 10గంటలకు మహిళల విభాగాల్లో, ఫిబ్రవరి 2వ తేదీన కొత్తగూడెం సెయింట్ జేవీఆర్ పాఠశాలలో ఉదయం 10 గంటలకు పురుషుల జట్టుకు ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన జట్లు ఫిబ్రవరి 8 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు.

క్రీడాకారులకు సీఈ అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న బీటీపీఎస్ సీఈ బిచ్చన్న

మణుగూరు రూరల్: ఇటీవల పాల్వంచలో నిర్వహించిన టీఎస్ జెన్‌కో హాకీ, బాస్కెట్ బాల్ పోటీల్లో భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ఉద్యోగులు ప్రతిభ చాటి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. సోమవారం ఉద్యోగ క్రీడాకారులను బీటీపీఎస్ సీఈ బిచ్చన్న అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంస్థ క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులతోపాటు స్పోర్ట్స్ కార్యదర్శి కల్తీ నరసింహరావు, క్రీడాకారులు బి.ఉదయ్‌కుమార్, పి.రవితేజ, జి.విజయ్‌రామ్, ఎం.నాగేశ్వరరావు, ఎండీ సాజిద్, డి.రమేష్, ఎస్‌కె గని, జీ సతీష్‌రెడ్డి, ఎస్‌కె రాయ్‌సాబ్, ఎండీ అమీర్ ఖాన్ పాల్గొన్నారు.

మైనారిటీ మహిళపై దాడి

ఆలస్యంగా వెలుగుచూసిన ఉదంతం



బాధిత మహిళ షేక్ షమీం

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : గణతంత్ర దినోత్సవం రోజున ఓ మహిళపై జరిగిన దాడి ఘటనకు సంబంధించిన వీడియోలు సోమవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. పోలీసులు, స్థానికులు, బాధితుల కథనం ప్రకారం .. మండలంలోని కట్టుగూడెం గ్రామానికి చెందిన జామాయిల్ కలప వ్యాపారి ఎస్కే నజీర్‌కు, రంగాపురం గ్రామానికి చెందిన తాళ్లూరి శ్రీను, రాజాపురం గ్రామానికి చెందిన జామాయిల్ కలప వ్యాపారి దుబాకుల వెంకటేశ్వర్లుకు మధ్య వ్యాపారానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. ఈ క్రమంలో రూ. 11 వేలు ఇవ్వాల్సి ఉండగా నజీర్ కుటుంబాన్ని ఆదివారం ఎర్రగుంటలోని యువజన కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు వేముల నరేష్ పురుగుల మందు దుకాణం వద్దకు పిలిపించారు. నగదు ఇవ్వాలని ఒత్తిడి చేయగా, తమకు వ్యాపారంలో నష్టం వచ్చిందని, రూ. 6 వేలు మాత్రమే ఇవ్వగలమని నజీర్ దంపతులు ప్రాధేయపడ్డారు. ఈ క్రమంలో వ్యాపారి వెంకటేశ్వర్లు, అతని అనుచరులు దుర్భాషలాడుతూ నజీర్, షమీం దంపతులతోపాటు బంధువు యాకూబ్‌ను చితకబాదారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీ ఫుటేజ్ వైరల్‌గా మారింది. కాగా తీవ్రగాయాలపాలైన మహిళ షమీంను కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఉదంతంపై ఎస్ఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇరువర్గాలకు చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నకిలీ స్వామీజీ అరెస్ట్

అశ్వారావుపేటరూరల్: శాంతి పూజలు, ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక పూజల పేరుతో మాయమాటలు చెబుతూ నగదు వసూళ్లకు పాల్పడుతున్న ఓ నకిలీ స్వామీజీని సోమవారం ఏపీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఏపీ రాష్ట్రం ఏలూరు జిల్లా నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం పేరాయిగూడేనికి చెందిన టి.బాలయ్య కొంతకాలంగా స్వామీజీ వేషాధారణలో సంచరిస్తూ శాంతి పూజలు పేరుతో నగదు వసూళ్లు చేస్తున్నాడు. దీంతో బాధితులు చాట్రాయి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్సై కె.రామకృష్ణ ఆధ్వర్యంలో విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలోనే చాట్రాయి శివారులో వాహనాల తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై వస్తున్న స్వామీజీని గుర్తించి పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి, రూ.80 వేల నగదు రికవరీ చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.



మంచు దుప్పటిలో పేట

అశ్వారావుపేటలో ఈ నెల ప్రారంభం నుంచి మంచు అధికంగా కురుస్తోంది. పగటి ఉష్ణోగ్రతలు సైతం తక్కువగా నమోదవుతున్నాయి. గత వారం రోజులుగా ఉదయం మంచు దుప్పటి కప్పేసినట్లు ఆంధ్రాలోని అరకు ప్రాంతంలా మారిపోతోంది. రహదారులు, భవనాలు కనిపించడం లేదు. ఉదయం 8 గంటల వరకు వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లాల్సి వస్తోంది. – అశ్వారావుపేట

భర్త మృతి చెందిన రెండు రోజులకే..

ప్రాణాలు విడిచిన భార్య



కర్నె సోమయ్య, నాగమ్మ(ఫైల్)

మణుగూరు టౌన్: భర్త మృతిని జీర్ణించుకోలేని ఓ మహిళ రెండు రోజుల్లోనే తుదిశ్వాస విడిచింది. ఈ విషాద ఘటన మండలంలోని పగిడేరు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన కర్నె సోమయ్య అనారోగ్యంతో ఈ నెల 24న మృతి చెందాడు. భర్త మృతితో భార్య కర్నె నాగమ్మ(64) కన్నీరుమున్నీరై వేదనతో తల్లడిల్లింది. తాను కూడా బతకలేనంటూ బంధువుల వద్ద రోదించింది. ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచింది. వీరికి ఆరుగురు మగ సంతానం కాగా, రెండు రోజుల వ్యవధిలోనే తండ్రి, తల్లిని కోల్పోయిన వారి రోదనలు మిన్నంటాయి.

పలువురి నివాళి

రెండు రోజుల క్రితమే తండ్రి మరణం, ఆదివారం రాత్రి తల్లి మరణంతో తల్లడిల్లుతున్న ఆ కుటుంబాన్ని పలువురు పరామర్శించి నాగమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, కొర్సా ఆనంద్, గాండ్ల సురేశ్, రహీంపాషా, పల్లం నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, పట్టణ అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, కుంటా లక్ష్మణ్, సీపీఐ, సీపీఎం నాయకులు సంతాపం తెలిపారు. మృతుల కుమారుడు, సామాజిక కార్యకర్త కర్నె రవిని ఓదార్చారు.

లేగ దూడలపై కుక్కల దాడి



కుక్కల దాడిలో గాయపడిన దూడకు చికిత్స చేస్తున్న గోపాలమిత్ర

అశ్వారావుపేటరూరల్: ఓ గేదెతో పాటు నాలుగు దూడలపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచిన ఘటన అశ్వారావుపేటలో సోమవారం చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని కొనేరుబజార్‌కు చెందిన తానికొండ కొండయ్య నాలుగు లేగ దూడలను ఇంటి సమీపంలోని గొడ్ల సావిడిలో కట్టేసి ఉంచగా ఆరు కుక్కలు వాటిపై దాడి చేశాయి. గమనించిన రైతు కుక్కలను తరిమేందుకు కర్ర తీసుకుని రాగా, అతడిపైనా దాడికి యత్నించాయి. స్థానికులు రాళ్లతో వాటిని అడ్డుకోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోతూ దారిలో మరో రైతుకు చెందిన పాడి గేదెపై కూడా దాడి చేశాయి. అనంతరం కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన లేగదూడలు, గేదెకు చికిత్స చేయించారు. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని అధికారులను స్థానికులు కోరారు.

భూ వివాదంలో ఘర్షణ

రజక సంఘం నాయకుడిపై దాడి



దాడి చేస్తున్న దృశ్యం

పాల్వంచ: పట్టణంలోని శ్రీనివాస కాలనీ వద్ద సోమవారం భూ వివాదంలో ఘర్షణ జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. రజక సంఘం నాయకుడు చిటికెన మునలయ్య సర్వే నంబర్ 817/1/2లోని తన భూమిలో పంటకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో పాల్వంచకు చెందిన సముద్రాల సైదులు, సముద్రాల రామకృష్ణ, కోటిపల్లి సాయిబాబు మరికొందరు వచ్చి అతనిపై దాడికి పాల్పడ్డారు. గాయాలు కావడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరి మధ్య భూ కొంతకాలంగా భూ వివాదం నడుస్తోందని, ఈ నేపథ్యంలో సుమారు 40 మంది కలిసి దాడి చేశారని స్థానికులు తెలిపారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా చికిత్స పొందుతున్న మునలయ్యను రజక సంఘం నాయకులు పరామర్శించారు. ఆస్పత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ రజకులపై అగ్రవర్ణ పెత్తందారుల దాడులను ఖండించాలన్నారు. భూమిని ఆక్రమించాలనే ఉద్దేశంతో దాడికి దిగారని ఆరోపించారను. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నంద్యాల వెంకటేశ్వర్లు, యాదగిరి, నాగయ్య, పోతురాజు, కంచర్ల శ్రీనివాస్, సాలికోల శివకుమారి, రోజా రాణి, రామతులసి, సక్కుభాయి, సుధాకర్ పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు శిక్ష

భద్రాచలంటౌన్: చెల్లని చెక్కు కేసులో నిందితురాలికి ఆరు నెలల జైలు శిక్షను విధిస్తూ సోమవారం భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయస్థానం తీర్పు వెలువరించింది. పట్టణంలోని జగదీష్ కాలనీకి చెందిన మునిషా బేగం వద్ద సరిహద్దు ఏపీలోని ఎటపాక మండలం మేడివాయి గ్రామానికి చెందిన తన్నీరు లక్ష్మి 2017లో అప్పు తీసుకుంది. అప్పు చెల్లించాలని కోరగా, లక్ష్మి చెక్కు ఇచ్చింది. బ్యాంకులో సమర్పించగా అది చెల్లని చెక్కుగా అధికారులు తేల్చారు. దీంతో బాధితురాలు కోర్టును ఆశ్రయించింది. కేసు పూర్వపరాలను పరిశీలించి, ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి వి.శివనాయక్ నిందితురాలు లక్ష్మికి ఆరు నెలలు జైలు శిక్ష విధించారు. బాధితురాలికి రూ.మూడు లక్షల నష్టపరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

కేసు నమోదు

పాల్వంచ: గంజాయి సేవిస్తున్న వ్యక్తులపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని కేటీపీఎస్ బీ కాలనీలో ఓ పాడుబడ్డ క్వార్టర్‌లో గంజాయి తాగుతున్నట్లు సమాచారం అందగా పోలీసులు దాడి చేశారు. 0.550 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణా నగర్‌కు చెందిన నందిగాం పవన్ గోపి, ఎ కాలనీకి చెందిన షేక్ ఇమ్రాన్, ప్రశాంత్ నగర్ కాలనీకి చెందిన మిర్జా అహ్మద్ పాషా, బొల్లేరుగూడేనికి చెందిన మాలోతు ప్రవీణ్, పాలపోలు అరుణ్‌లను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు ప్రశాంత్, దామిని దాస్ పరారయ్యారు. కేసు నమోదు చేసి, ఐదుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.